# గుడు గుడు గుంచం ఆట - గుజ్జన గూళ్ళ ఆట

కొంత మంది పిల్లలు ఒక చోట చేరి తమ తమ ఇళ్ళ నుంచి ఉప్పో, పప్పో, చింతపండో, ఉల్లిపాయలో, కారమో లాంటివి ఏదో ఒకటి తెచ్చి తమ దగ్గర ఉన్న లక్కపిడతల్లో వండుకుని తింటూ "బువ్వాలాట" అని ఆడుకుంటారు. దీనినే గుజ్జన గూళ్ళు అని కూడా అంటారు.

ఈ గుడు గుడు గుంచం ఆటలో ఒక అద్భుతమయిన పాట అనండి, పద్యం అనండి - ఒకటి ఉంది. మా చిన్న మావయ్యగారు జొన్నలగడ్డ లక్ష్మీనరశింహారావుగారు నాకు తెలిసిన పాటలో తప్పులు సరిదిద్ది, అసలు పద్యాన్ని అందిచ్చినందుకు వారికి నా ధన్యవాదాలు.

సరే ఇక ఆట విషయానికి వస్తే , ఎలా ఆడతారో చూద్దామా ? ఇద్దరు ముగ్గరు పిల్లలు చేరి పిడికిళ్ళు ముడిచి ఒకరి పిడికిలి పైన మరొకరి పిడికిలి పెట్టి, పై పిడికిలి మధ్య ఖాళీలో ఒకళ్ళ చూపుడు వేలు పెట్టి తిప్పుతూ "గుడు గుడు గుంచం, గుండారాగం, పాముని పట్నం, పడగా రాగం, కత్తెయ్యనా? బద్దెయ్యనా? వేణ్ణీళ్ళొయ్యనా? చణ్ణీళ్ళొయ్యనా?" అని పాడుతూ వేణ్ణీళ్ళూ అన్న వారి పిడికిలి గట్టిగాను, చణ్ణీళ్ళు అన్న వారి పిడికిలి చిన్నగాను గిచ్చుతూ అన్ని పిడికిళ్లనూ అలాగే పూర్తి చేస్తారు.

అలా వేళ్ళు తిప్పేటప్పుడు కలిగే చక్కిలిగింత ఆ చిన్ని హృదయాలలో ఒక మంచి అనుభూతిని మిగులుస్తుంది. గిల్లినప్పుడు పిల్లలు తమ చేతులు వెనక్కి పెట్టుకుంటారు.అప్పుడు చేతులు గిల్లిన పిల్లాడు, అలా వెనక్కిపెట్టుకున్న పిల్లలని ప్రశ్న రూపంలో అడుగుతూ ఉంటే, ఆ పిల్లలు వాటికి సమాధానం ఇలా చిత్రమయిన రీతిలో చెపుతారు. ఒక సారి పరికించండి.



PDF created with pdfFactory trial version www.pdffactory.com

పిట్టీ నీ చేతులేవి
పిల్లెత్తుకు పోయింది
ఎక్కడదాకా ఎత్తుకు పోయింది
గోలుకొండదాకా
గోలుకొండే మిచ్చింది?
గుడ్డిగవ్వ
గుడ్డిగవ్వ ఏం చేశావు?
కుమ్మరికిచ్చాను
కుమ్మరే మిచ్చాడు?
కుండ
కుండనేం చేశావు ?
మా తాతకిచ్చాను
మీ తాతేంచేశాడు?
నీళ్ళు తాగబోయి నూతిలో పడేసాడు
నుయ్యే మిచ్చింది?
నీళ్ళు
నీళ్ళు ఏం చేశావు ?
మొక్కలకి పోసాను
మొక్కలే మిచ్చాయి?
పువ్వులు
పువ్వులేం చేశావు?
మాయప్ప కొప్పులో పెట్టాను


PDF created with pdfFactory trial version www.pdffactory.com

కొప్పేమిచ్చింది?

పేను

పేనేం చేశావు ?

గడప మీద వేసి కుక్కాను

గడప ఏమిచ్చింది?

చెక్క

చెక్క ఏం చేశావు?

పొయ్యిలో పెట్టాను

పొయ్యే మిచ్చింది ?

బూడిద

బూడిదేం చేశావు?

పెంట మీదేసాను

పెంటే మిచ్చింది?

ఎరువు

ఎరువేంచేసావు?

చేనుకేసాను

చేనే మిచ్చింది?

పచ్చ గడ్డి

గడ్డేం చేశావు ?

ఆవుకేశాను

ఆవే మిచ్చింది?

పాలు



PDF created with pdfFactory trial version www.pdffactory.com

పాలేం చేశావు?
పరమాన్నం వండాను
పరమాన్నం ఏం చేశావు?
ఉట్టి మీద పెట్టాను
నాక్కొంచెం పెట్టవా?
లేదు. మావాళ్ళ పిల్ల తుఱ్ఱు మని వచ్చి ఆయింతా
నాకిపోయింది

ఇలా అనగానే అందరూ నవ్వుకుంటారు.

ఇది చాలా వరకు ముక్తమయిన, ముగ్ధమయిన మాటలతో ఉండటం వల్ల ఎంత చేంతాడు లాగా ఉన్నా గుర్తుంచుకోవటం సులభం.ఇలాంటి ఆటల్లోని పద్యాల వల్ల చిన్న పిల్లలకు ధారణ, భాష అలవడతాయి.

అన్నిటికన్నా తమ చుట్టుపక్కల ఉన్న ప్రపంచంలో ఏమేం పనులు జరుగుతాయో సులభంగా అవగతమవుతుంది.

అదండీ మన గుడు గుడు గుంచం ఆట కథ

Keywords: guDu guDu guncham aata, guDuguDuguncham aaTa pATa, china pillala aaTa pATa, china pillala padyAlu, telugulO aata pATala padyAlu



PDF created with pdfFactory trial version www.pdffactory.com